ఎమ్మెల్యే త్వరగా కోలుకోవాలని పూజలు

ఆలయంలో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మద్దూరు(ధూళిమిట్ట), జూన్ 19: జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరెడ్డి త్వరగా కోలుకోవాలని కోరుతూ మద్దూరు పట్టణ బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. గురువారం మండల కేంద్రమైన మద్దూరులోని ఆంజనేయస్వామి ఆలయంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దామెర మల్లేశం ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసేవలో నిమగ్న మయ్యే ఎమ్మెల్యే ప్రమాదవశత్తు గాయపడడం తమను బాధిస్తుందన్నారు. ఎమ్మెల్యే త్వరగా కోలుకొని ఎప్పటి మాదిరిగానే ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అర్చకుడు పానుగంటి తిరుపతయ్య, బీఆర్ఎస్ నాయకులు కంఠారెడ్డి మధుసూదన్‌రెడ్డి, బోయిని మనోహర్, బొప్పె నాగయ్య, నీల బాలకృష్ణ, పిడిశెట్టి గౌరీశ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కెనాల్ నిర్మాణాన్ని నిలిపివేయండి

మీర్జాపూర్, పోతారం (ఎస్) రైతుల ధర్నా, రాస్తారోకో

జనగాం– హుస్నాబాద్ ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న మీర్జాపూర్, పోతారం(ఎస్) గ్రామాల రైతులు

హుస్నాబాద్‌రూరల్, జూన్ 19: గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించిన కుడివైపు ప్రధాన కాల్వకు ఇప్పటికే తాము భూములు ఇచ్చామని, మళ్లీ అధికారులు కొత్తగా సబ్‌మైనర్ కెనాల్ నిర్మిస్తామంటున్నారని మండలంలోని మీర్జాపూర్, పోతారం (ఎస్) గ్రామాలకు చెందిన రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం రైతులు జనగాం–హుస్నాబాద్ ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తగా చేపట్టే సబ్‌మైనర్ కెనాల్ నిర్మాణంతో తమ వ్యవసాయ భూములు కోల్పోతున్నామని, ఎట్టి పరిస్థితుల్లోనూ తమ భూములు ఇవ్వబోమన్నారు. ఈ మైనర్ కాల్వ వల్ల తమకు నష్టం వాటిల్లుతుందని, అధికారులు ఈ విషయంపై తమతో సమావేశం నిర్వహించాలని కోరారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ అక్కడకు చేరుకొని అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా, రాస్తారోకో విరమించారు.

ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ

విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తున్న జగదేవ్‌పూర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బానోతు రాజన్న

జగదేవ్‌పూర్, జూన్ 19: ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలను ఆ కళాశాల ప్రిన్సిపాల్ బానోతు రాజన్న గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు తమ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం అడ్మిషన్ తీసుకోవాలని సూచించారు. ఇంగ్లీష్, తెలుగు మీడియంలో అన్ని గ్రూపులు అందుబాటులో ఉన్నాయని, అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం పేద విద్యార్థులకు విద్యాబోధన అందించడంతో పాటు స్కాలర్‌షిప్ సౌకర్యాన్ని కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందక యువకుడి ఆత్మహత్య

- తండ్రితో పాటు ముగ్గురు కొడుకులకు అందని ప్యాకేజీ
- పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం శూన్యం
- మనస్తాపంతో గుండెపోటుతో ఇటీవల తండ్రి మృతి

అనిల్ (ఫైల్)

ములుగు, జూన్ 19 :ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, ప్లాట్లు అందక మనస్తాపానికి గురై ఓ యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని పునరావాస గ్రామం మామిడ్యాల్‌లో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన దాచారం మల్లయ్య, యాదమ్మ దంపతులకు ముగ్గురు పిల్లలున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన కొండపోచమ్మ రిజర్వాయర్‌లో భాగంగా 5.30ఎకరాల వ్యవసాయ భూమి ముంపునకు గురైంది. ఈ మేరకు తండ్రి మల్లయ్యతో పాటు పెద్ద కొడుకుకు ఫ్యామిలీ ప్యాకేజీ, ఇల్లు రావాల్సి ఉన్నది. కాగా పెండ్లి కాని మరో ఇద్దరు కొడుకులకు ప్లాటుతో పాటు ప్యాకేజీ అందాల్సి ఉండగా నేటికీ ఎలాంటి నష్టపరిహారం అందలేదు. అధికారులు, నాయకుల చుట్టు తిరుగుతూ తమ గోడును ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతో మనస్తాపం చెంది గుండెపోటుతో మూడు నెలల క్రితం తండ్రి మల్లయ్య మృతిచెందాడు. అనంతరం కుటుంబ భారం మోస్తున్న మల్లయ్య చిన్న కుమారుడు అనిల్(23) తమకు రావాల్సిన నష్టపరిహారం గురించి అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నాడు. అయినా ఎలాంటి స్పందన రాకపోవడంతో ఇంకా తమకు న్యాయం జరగదని భావించి గురువారం రాత్రి ఉరివేసుకున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు.

దుబ్బాక మున్సిపల్ సిబ్బంది నిరసన

- గుత్తేదారుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



మున్సిపల్ కార్యాలయం ముందు ఏఈ శ్రీకాంత్‌తో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

దుబ్బాక, జూన్ 19: దుబ్బాక మున్సిపల్ కార్యాలయంలో ఇంజనీరింగ్ ఏఈ శ్రీకాంత్‌ను అసభ్య పదజాలంతో దూషించిన గుత్తేదారుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ సిబ్బంది గురువారం నిరసన చేపట్టారు. పట్టణంలో ప్రొక్లయినర్‌తో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లును మంజూరు చేయాలని గుత్తేదారుడు, మాజీ కోఆప్షన్ మెంబర్ ఆస స్వామి ఇంజినీరింగ్ శాఖ ఏఈ శ్రీకాంత్‌ను కోరారు. ఈ విషయంలో ఏఈ శ్రీకాంత్ పనులకు సంబంధించిన ఫొటోలు ఉంటేనే మంజూరు చేస్తామనడంతో ఇరువురి మధ్య వాగ్వదం నెలకొంది. ఈ విషయంలో గుత్తేదారుడు తనను అసభ్యపదజాలంతో దూషించాడని, తన సెల్‌ఫోన్ ధ్వంసం చేసి విధులకు అటంకం కలిగించడని ఏఈ శ్రీకాంత్ దుబ్బాక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై మున్సిపల్ సిబ్బంది పెన్‌డౌన్ చేపట్టి ఏఈ శ్రీకాంత్‌కు మద్దతుగా మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఆస స్వామి మాట్లాడుతూ.. తనకు ప్రొక్లయినర్ పనులకు సంబంధించిన రూ.24 వేలు మున్సిపల్ నుంచి రావల్సి ఉందన్నారు. పనులకు సంబంధించిన ఫోటోలు అందజేసినప్పటికీ బిల్లు మంజూరు చేయకపోవడంతోనే గొడవ నెలకొందన్నారు.

మద్దూరులో ప్లాస్టిక్ వాడకం నిషేధం

- ప్లాస్టిక్ వినియోగిస్తే రూ. 5వేల జరిమానా

మద్దూరు(ధూళిమిట్ట), జూన్ 19: మద్దూరు గ్రామ పంచాయతీ పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేదస్తూ తీర్మానించారు. ఈ మేరకు గురువారం గ్రామ పంచాయతీ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు నోటీసులు జారీ చేశారు. కనీసం 50మందికి తగ్గకుండా స్టీల్ గ్లాస్‌లు లేదా గాజు గ్లాసులు, స్టీల్ ప్లేట్లు ఏర్పాటు చేసుకోవల్సిందిగా సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని కార్యాలయాల్లో స్టీల్ బ్యాంక్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. గ్రామంలోని అన్ని హోటళ్ల యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి స్టీల్, గాజు గ్లాసులను వాడాలని సూచించినట్లు తెలిపారు. జూలై 15 తర్వాత ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు, వస్తువులు వాడితే రూ. 5వేల జరిమానా విధించనున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లకు బదులు స్టీల్ వస్తువులు వాడి పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు.

అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ రేవంత్‌రెడ్డి

- తెలంగాణ ప్రజలపై కేసీఆర్‌కు ఉన్న ప్రేమ.. రేవంత్‌రెడ్డికి ఉండదు
- బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట, జూన్ 19: సీఎం రేవంత్‌రెడ్డి తన ఉనికికి ప్రమాదం వస్తుందనే భయంతో తెలంగాణ తెచ్చిన కేసీఆర్‌పై మీడియాలో ఇష్టారీతిగా వ్యాఖ్యలు చేస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణ శర్మ అన్నారు. గురువారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాయకులు పాల సాయిరాం, మాణిక్యరెడ్డి, మోహన్‌లాల్, ఎడ్ల సోమిరెడ్డిలతో కలిసి ఆయన మాట్లాడారు. అబద్ధాలకు అంబాసిడర్ అయిన సీఎం రేవంత్‌రెడ్డి 420 వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చాననే విషయం మరిచి ఇష్టానుసారంగా కేసీఆర్, హరీశ్‌రావులపై వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. అసత్యాలు మాట్లాడితే ప్రజలే తగిన బుద్ధి చెప్తారని, గత అపెక్స్ కౌన్సిల్‌లో కేసీఆర్ చెప్పిన విషయాలను వక్రీకరిస్తూ అవగాహన లేకుండా సీఎం మాట్లాడుతూ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. రాష్ట్రంలో నీటి వనరులను కాపాడాలనే ధ్యాస రేవంత్‌రెడ్డికి లేదని, రాజకీయ ప్రయోజనాలే తప్ప రాష్ట్ర ప్రయోజనాలు పట్టవన్నారు. తెలంగాణ ఉద్యమమే నీళ్లు, నిధులు, నియామకాలపై జరిగిందని, తెలంగాణ కోసం 14 ఏండ్లు పోరాటం చేసి ప్రత్యేక రాష్ట్రం సాధించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రంపై కేసీఆర్‌కు ఉన్న ప్రేమ రేవంత్‌రెడ్డికి లేదని, ఆయనకు కమిషన్లపై ఉన్న మీద శ్రద్ధ, తెలంగాణ ప్రయోజనాలను కాపాడడంలో లేదన్నారు. రేవంత్‌రెడ్డికి బనకచర్లపై పూర్తిగా అవగాహన లేదన్నారు. పోరాటం చేసి రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్‌పై మాట్లాడిన రేవంత్‌రెడ్డిని సమయం వస్తే ప్రజలే తగిన బుద్ధి చెప్తారన్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అవడమే తెలంగాణ ప్రజలకు శాపమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్లనే తెలంగాణ సస్యశ్యామలం అయిందన్నారు. ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపితే కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. సమావేశంలో నాయకులు పాల సాయిరాం, కుంబాల ఎల్లారెడ్డి, శాతరాజుపల్లి ఆంజనేయులు, శ్రీకాంత్‌గౌడ్, కనకరాజు, రెడ్డి యాదగిరి, సామల్ల సాయిప్రేమ్, రెబల్ రమేశ్, సాయిగౌడ్ పాల్గొన్నారు.

దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలి

- కలెక్టర్ హైమావతి

రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

కోహెడ, జూన్ 19: రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను త్వరగా విచారణ చేసి రైతుల సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ హైమావతి సూచించారు. మండలంలోని సముద్రాలలో గురువారం రెవెన్యూ అధికారులు నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల దరఖాస్తులపై విచారణ పూర్తయిన వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఆర్డీవో రామ్మూర్తి, తహసీల్దార్ సయ్యద్ ఆహ్మద్‌ఖాన్, సీనియర్ అసిస్టెంట్ రాములు, అధికారులు పాల్గొన్నారు.

వింజపల్లిలో...

భూసమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సిద్దిపేట జాయింట్ కలెక్టర్ అబ్దుల్ హమీద్ అన్నారు. గురువారం మండలంలోని వింజపల్లిలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. సదస్సులో ఏఎంసీ చైర్మన్ నిర్మలజయరాజ్, డిప్యూటీ తహసీల్దార్ దేవేంద్ర, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఎల్లయ్య, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గౌరవెల్లి రిజర్వాయర్‌ను సందర్శించిన కలెక్టర్

రిజర్వాయర్ గురించి కలెక్టర్‌కు వివరిస్తున్న అధికారులు

అక్కన్నపేట, జూన్ 19: మండలంలోని గౌరవెల్లి రిజర్వాయర్‌ను కలెక్టర్ హైమావతి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ అధికారులు ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలు, నిర్మాణంలో ఉన్న డిస్ట్రిబ్యూటరీ కాల్వల గురించి కలెక్టర్‌కు వివరించారు. భూ సేకరణ త్వరగా పూర్తిచేసి డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ నిర్మాణం త్వరితగతిన అయ్యేలా చూడాలని ఆమె అధికారులకు సూచించారు.

ప్రజాపాలన పేరుతో వంచన పాలన

సమావేశంలో మాట్లాడుతున్న కామునీ శ్రీనివాస్

చిన్నకోడూరు, జూన్ 19: ఏపీ ప్రభుత్వం నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్టును సీఎం రేవంత్‌రెడ్డి అడ్డుకోకపోతే చరిత్రలో అసమర్థ సీఎంగా నిలిచిపోతారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రమైన చిన్నకోడూరులో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్, హరీశ్‌రావుపై విమర్శలు చేస్తూ సీఎం కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించిందని తెలిపారు. సమావేశంలో గంగాపూర్ సొసైటీ చైర్మన్ కనకరాజు, మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ఉమేష్ చంద్ర, బీఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు వేణు, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుంటయ్య, ఎల్లయ్య, మొండయ్య, రమేష్, రాజు, సాయి, రాజశేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

బనకచర్లను ఆపకపోతే రాజీనామా చేయాలి

మాట్లాడుతున్న ఏలేటి వెంకట్‌రెడ్డి

చిన్నకోడూరు, జూన్ 19: ఏపీ ప్రభుత్వం నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకోకపోతే సీఎం పదవికి రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని ఎఫ్‌పీవో చైర్మన్ ఏలేటి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రమైన చిన్నకోడూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బనకచర్ల ప్రాజెక్టును ఆపాలని డిమాండ్ చేసిన వారిపై కాంగ్రెస్ ప్రభుత్వం బురదచల్లుతుందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసే బనకచర్ల ప్రాజెక్టును ఆపాలని కోరారు. కేసీఆర్, హరీశ్‌రావులను సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించడం మానుకోవాలని హెచ్చరించారు. సమావేశంలో సీనియర్ నాయకులు మండల రాఘవరెడ్డి, మోసర్ల మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ ఉన్నారు.

రోడ్డు భద్రతా ప్రమాణాలను అమలు చేయాలి

మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ

సిద్దిపేట టౌన్, జూన్ 19: రోడ్డు భద్రత ప్రమాణాలను పటిష్టంగా అమలు చేయాలని సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్ సూచించారు. రోడ్డు భద్రతపై గురువారం పోలీసు అధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు, రోడ్డు భద్రతా కమిటీ ఆదేశాల మేరకు మోటార్ వాహనాల చట్టం, సెంట్రల్ మోటార్ వాహన నిబంధనల అమలు తదితర వాటిని చర్చించడానికి సమావేశం ఏర్పాటు చేశామన్నారు. రోడ్డు ప్రమాదాలను 2030 నాటికి 50 శాతం తగ్గించే లక్ష్యంగా ప్రభుత్వం రోడ్డు భద్రతా కమిటీ అమలు చేస్తుందన్నారు. సమావేశంలో ట్రాఫిక్ సీఐలు ప్రవీణ్‌కుమార్, మురళి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సహకరిస్తే నేరాల అదుపు సులువు

మాట్లాడుతున్న ఏసీపీ సదానందం

కోహెడ, జూన్ 19: ప్రజలు సహకరిస్తే పోలీసులకు నేరాల అదుపు సులువు అవుతుందని హుస్నాబాద్ ఏసీపీ సదానందం అన్నారు. గురువారం సాయంత్రం మండల కేంద్రంలోని ఏఎంసీ సమీపంలో కోహెడ ఎస్సై అభిలాష్ నిర్వహించిన కార్డెన్ సెర్చ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమన్నారు. కార్డెన్ సెర్చ్‌లో కోహెడలో 47 వాహనాలను స్వాధీనం చేసుకున్నామని, సరియైన ధృవీకరణ పత్రాలు చూపించి వాహనాలు తీసుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, కోహెడ, హుస్నాబాద్, అక్కన్నపేట ఎస్సైలు అభిలాష్, మహేష్, విజయభాస్కర్, హుస్నాబాద్ సర్కిల్ పోలీస్ సిబ్బంది, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మణ్, కుమరస్వామి, వెంకటస్వామి పాల్గొన్నారు.

పొద్దుతిరుగుడు డబ్బులు విడుదల చేయాలి

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట, జూన్ 19: పొద్దుతిరుగుడు గింజలను మూడు నెలలవుతున్నా ఇంతవరకు పూర్తి స్థాయిలో రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేయకపోవడం సిగ్గుచేటని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎడ్ల సోమిరెడ్డి అన్నారు. గురువారం సిద్దిపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు కుంబాల ఎల్లారెడ్డి, ఆంజనేయులులతో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తామని ప్రగల్భాలు పలికి రైతులకు బేడీలు వేసి రైతులను అవమానపరిచారన్నారు. రైతును రాజును చేస్తానని చెప్పి రైతులకు బేడీలు వేస్తూ కోర్టుకు తీసుకువెళ్లిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. తక్షణమే పొద్దు తిరుగుడు, సన్న వడ్ల రైతులకు బోనస్ పూర్తిగా చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించేలా కృషి చేయాలన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

చేర్యాల, జూన్ 19: మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చేర్యాల మున్సిపల్ కమిషనర్ నాగేందర్ అన్నారు. గురువారం తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు వర్షాకాల ముందస్తు జాగ్రత్తలలో భాగంగా వంద రోజుల కార్యక్రమంలో చేర్యాల పట్టణంలోని 5వ వార్డు బీడీ కాలనీలో స్వచ్ఛత–పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు.

దవాఖానలను తనిఖీ చేసే అధికారం ఐఎంఏకు లేదు

గజ్వేల్, జూన్ 19: ప్రైవేటు దవాఖానలను తనిఖీ చేసే అధికారాలు ఐఎంఏ అసోసియేషన్ ప్రతినిధులకు లేదని, ప్రైవేటు దవాఖానలపై ఎలాంటి అరోపణలున్నా తమ దృష్టికి తీసుకురావాలని డీఎంహెచ్‌వో పల్వన్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని పలు ప్రైవేటు దవాఖానలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ రెండు రోజుల క్రితం ఐఎంఏ ప్రతినిధులు గజ్వేల్‌లోని పలు ప్రైవేటు దవాఖానలను ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో వారికి, డాక్టర్లకు షోకాజ్ నోటిసులు జారీ చేశామన్నారు. మరోసారి తనిఖీలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రైవేటు దవాఖానలు, స్కానింగ్ సెంటర్లపై పర్యవేక్షణ అధికారాలు కేవలం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకే ఉంటుందన్నారు. ఆయన వెంట జిల్లా మాతా, శిశు దవాఖానల పర్యవేక్షణాధికారి ఆనంద్‌కుమార్ ఉన్నారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు

జగదేవ్‌పూర్ జూన్ 19: ఎరువులు, విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే దుకాణదారులపై చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారిణి రాధిక హెచ్చరించారు. గురువారం మండల కేంద్రమైన జగదేవ్‌పూర్, మునిగడపలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో ఏవో వసంతరావుతో కలిసి ఆకస్మిక తనిఖీలు చేశారు. ఆమె వెంట ఏఈవోలు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

ప్రభుత్వ పాఠశాలలో తన కుమారుడిని చేర్పిస్తున్న మధు

చేర్యాల, జూన్ 19: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు అన్నివర్గాల ప్రజలు తమ పిల్లలను సర్కారు బడిలో చేర్పించాలని హెచ్ఎం పాశికంటి వెంకటరమణ కోరారు. మండలంలోని కొత్త దొమ్మాట ప్రాథమికోన్నత పాఠశాలలో బీఆర్ఎస్ కార్మిక విభాగం మండల ప్రధాన కార్యదర్శి కొలిపాక మధు ఆయన కుమారుడు దేవాంశ్‌ను గురువారం ప్రైవేటు పాఠశాల నుంచి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. హెచ్ఎం మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సర్కారు బడిని ఆదరించాలని, మధు తన కుమారున్ని సర్కారు బడిలో చేర్పించి ఇతరులకు ఆదర్శంగా నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్రెండ్స్ హెల్పింగ్ హాండ్స్ సేవలు అభినందనీయం

విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న ఫ్రెండ్స్ హెల్పింగ్ హాండ్స్ సభ్యులు

చేర్యాల, జూన్ 19: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు హైదరాబాద్ ఫ్రెండ్స్ హెల్పింగ్ హాండ్స్ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఆకునూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం అయోధ్య అన్నారు. మండల పరిధిలోని ఆకునూరు పాఠశాల విద్యార్థులకు ఫ్రెండ్స్ హెల్పింగ్ హాండ్స్ సభ్యులు గురువారం 380 నోటు పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఏపీసీ చైర్మన్ రాజేశ్వరి, సభ్యులు అశోక్, ఫ్రెండ్స్ హెల్పింగ్ హాండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్‌రావు, ఉపాధ్యక్షులు జగన్మోహన్, సభ్యులు లక్ష్మీపతి, నరేష్, మల్లేశం, ఉపాధ్యాయులు యాదయ్య, శ్యాంసుందర్‌రెడ్డి, సమ్మయ్య, ప్రేమ్‌కుమార్, రాజయ్య, రాధాబాయి, సరోజనీదేవి, భవానీ, శాశ్వత దాత సాయికుమార్, ఆంద్రయ్య, కిష్టయ్య, లక్ష్మారెడ్డి, నర్సింహులు పాల్గొన్నారు.

పాఠశాలకు స్మార్ట్ టీవీ, సౌండ్ సిస్టం వితరణ

చేర్యాల, జూన్ 19: మండలంలోని చుంచనకోట ప్రాథమిక పాఠశాలలో విద్యనభ్యసించిన వినోదిని తన మాతృమూర్తి తాండ్ర రాజుభాయ్ జ్ఞాపకార్థం రూ.30వేలు విలువ చేసే స్మార్ట్ టీవీ, సౌండ్ సిస్టం విరాళంగా ఇచ్చారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో టీవీ, తదితర సామగ్రిని భువనేశ్వరి మాత ఉపాసకులు లలితామాత శర్మ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మురళీకృష్ణ, అంబాల వెంకటేశ్, ఉపాధ్యాయులు మల్లికార్జున్, శారద, రజిత, ఉషారాణి పాల్గొన్నారు.

గ్రూపు రాజకీయాలను ప్రోత్సహిస్తున్న మైనంపల్లి

మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్లు

గజ్వేల్, జూన్ 19: గజ్వేల్‌లో గ్రూపు రాజకీయాలను ప్రోత్సహిస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావును ఖబడ్దార్ అని గజ్వేల్, కొండపాక, వంటిమామిడి వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్లు వంటేరు నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విజయమోహన్ హెచ్చరించారు. గురువారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీలో ఉంటా డో తెలియని వ్యక్తి తరుచూ గజ్వేల్‌కు వచ్చి శకునిలా మారాడన్నారు. మల్కాజిగిరి, మెదక్‌కు పోవాలి కాని గజ్వేల్‌కు రావడమేంటని, ఇక్కడేమి పని అంటూ ప్రశ్నించారు. మల్కాజిగిరిలో చెల్లని రూపాయి గజ్వేల్‌లో చెల్లుతుందా అన్నారు. ఇక్కడి నాయకత్వం కోసం జిల్లా వ్యాప్తంగా గ్రూపులను ప్రోత్సహిస్తున్నాడన్నారు. అహంకారం, పెత్తందారి పోకడలున్న అతను పద్ధతి మార్చుకోవాలన్నారు. సమావేశంలో ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్, మండలాల అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, రాజు, కనకయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేట టౌన్, జూన్ 19: హైదరాబాద్ బంజారాహిల్స్ ఎస్సీ స్టడీ సర్కిల్లో ఉచిత సివిల్ శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సిద్దిపేట జిల్లా అభివృద్ధి శాఖ అధికారి కవిత, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీకాంత్ గురువారం తెలిపారు. సివిల్స్‌కు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు జూలై 7లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ద